ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శనివారం 16 ఆగస్టు 2025





గ్రామాల్లో తాగు నీటి సదుపాయం మెరుగు పరిచేందుకు ప్రభుత్వం రూ.153.22 కోట్లు, గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రెయిన్‌ల అభివృద్ధికి రూ.231.47 కోట్లు, కాల్వలు, డ్రెయిన్ల మెరుగుదలకు రూ.52.45 కోట్లు కేటాయించాం.
- మంత్రి నిమ్మల రామానాయుడు

సుపరిపాలనే మా ధ్యేయం

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు.. 79వ స్వాతంత్ర్య దినోత్సవంలో మంత్రి నిమ్మల

భీమవరం కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి శాల్యూట్ చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, చిత్రంలో పీఏసీ చైర్మన్ అంజిబాబు, కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం అస్మి, జేసీ రాహుల్ తదితరులు

భీమవరం టౌన్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): 'అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పయనించేలా కృషి చేస్తున్నాం. జిల్లాను వేగవంతంగా సుస్థిరమైన అభివృద్ధి సాధిస్తూ.. సుపరిపాలన అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం.' అని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. భీమవరం పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం జరిగిన 79వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రత్యేక వాహనంలో పరేడ్ మైదానాన్ని సందర్శించి పోలీసు దళాల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. జిల్లాలో ఉత్తమ పనితీరు కనబర్చిన అధికారులకు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ జిల్లా ప్రగతిని వివరించారు.

64 వేల మందికి ఉచిత వైద్యం

జిల్లా ఏర్పడి మూ డేళ్లు పూర్తయ్యినప్పటికీ మౌలిక సదుపాయాలతోపాటు, కార్యాలయాలు నిర్మించాలి. ప్రభుత్వం వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఆకివీడు సీహెచ్‌సీ, పాలకొల్లు ఏరియా ఆసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలను ప్రారంభించాం. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలో 64 వేల మందికి ఉచిత వైద్యం అందించాం. ఇందుకు రూ.144 కోట్లు మంజూరుచేశాం. వృద్ధులు, దివ్యాంగులు, వివిధ ప్రతిభావంతులు, ఒంటరి మహిళలకు ప్రతి నెలా రూ.96.50 కోట్ల పెన్షన్ అందిస్తున్నాం. అన్నా క్యాంటీన్‌ల ద్వారా ప్రతీ రోజు జిల్లాలో 2,880 మందికి అల్పాహారం, 2,400 మందికి భోజనం అందిస్తున్నాం. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పీ-4 కార్యక్రమాన్ని చేపట్టాం. అన్నివర్గాల సహకారంతో జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం' అని మంత్రి పేర్కొన్నారు. వేడుకల్లో రాజ్యసభ సభ్యులు పాక వెంకట సత్యనారాయణ, కలెక్టర్ సీహెచ్ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, భీమవరం, తణుకు ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, ఆరిమిల్లి రాధాకృష్ణ, జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి, ఏఎస్పీ భీమారావు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల బ్యాగ్ పేపర్ బ్యాండ్ ప్రదర్శన ఆకట్టుకుంది.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



మహిళలకు ఉచిత బస్సు



ప్రథమ బహుమతి పొందిన వందేమాతర ప్రదర్శన

వ్యవసాయానికి ప్రాధాన్యం

- వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తూ ఖరీఫ్‌లో సాగు లక్ష్యం 2,27,675 ఎకరాలు. ఇప్పటికి 1,53,024 ఎకరాల్లో నాట్లు పూర్తి.
- గత రబీలో 77,629 మంది రైతుల నుంచి 7.17 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి వారి ఖాతాల్లో రూ.1653.73 కోట్లు జమ చేశాం.
- ఈ ఆర్థిక సంవత్సరంలో 1,05,000 మంది కౌలు రైతులకు గాను ఇప్పటి వరకు 69,500 సీసీఆర్‌సీ కార్డులు జారీచేశాం.
- రైతులకు పెట్టుబడి, అవసరాలకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కింద ఏడాదికి భూమి వున్న ప్రతీ రైతుకు రూ.20 వేలు పెట్టుబడిసాయం అందిసున్నాం. మొదటి విడతగా 1,03,761 మందికి రూ.70.14 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశాం.
- వ్యవసాయ యాంత్రీకరణ కింద రూ.3.84 కోట్ల రాయితీలో సబ్సిడీతో 709 మంది రైతులకు వ్యవసాయ పరికరాలను అందించాం. రైతులకు లక్ష నుంచి రూ.10 లక్షల వరకు రుణ సదుపాయాన్ని అందిస్తున్నాం.

ట్రంప్ సుంకాన్ని ఎదుర్కొంటాం

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆక్వాపై విధించిన సుంకాలను ఎదుర్కోటాం. ఆక్వా ఉత్పత్తుల ఎగుమతి, ధరలు పడిపోవటంతో రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మేత ధరను ప్రతి కిలోకు నాలుగు రూపాయలు తగ్గించింది. ఆక్వా రైతుకు యూనిట్ విద్యుత్‌ను రూపాయిన్నరకే ప్రభుత్వం అందిస్తోంది.
- మత్స్యకారులను ఆదుకోవడానికి వేట విరామ సమయంలో రూ.20 వేలు అందిస్తున్నాం.
- చంద్రన్న బీమా కింద మత్స్యకారులకు రూ.10 లక్షలు పరిహారం చెల్లిస్తున్నాం.
- పాల దిగుబడిని పెంచేందుకు 50 శాతం రాయితీతో 419 టన్నుల దాణాను పాడి రైతులకు పంపిణీ చేశాం.

తాగునీరు, రోడ్లు, కాల్వలకు నిధులు

- జల జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో మంచి నీటి వసతికి రూ.153.22 కోట్లు, సీసీ రహదారులు, డ్రెయిన్‌లు అభివృద్ధికి రూ231.47 కోట్లు, కాలువలు, డ్రెయిన్‌లు మెరుగుపరిచేందుకు రూ.52.45 కోట్లు వెచ్చించాం.
- ఈ ఏడాదే టిడ్కో ఇళ్లు పంపిణీ చేస్తాం.
- ఉచిత ఇసుక విధానంతో తగ్గిన ధరలు.. ప్రజలకు అందుబాటులోకి తెచ్చాం.
- మహిళలకు స్త్రీ శక్తి ద్వారా ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నాం.

తల్లికి వందనానికి రూ.230 కోట్లు

- పేద పిల్లలు చదువుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం తల్లికి వందనం కింద కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉన్నా వారికి పథకాన్ని ఇచ్చాం. ఈ ఏడాది 1,76,574 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.230 కోట్లు జమ చేశాం.

ఉత్తమ ప్రతిభకు సత్కారం

371 మందికి ప్రశంసా పత్రాలు అందజేసిన మంత్రి నిమ్మల, కలెక్టర్ నాగరాణి





స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో మెరుగైన పనితీరు కనబరిచిన 371 మందికి ప్రశంసా పత్రాలను మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్ నాగరాణి అందజేశారు. చిత్రంలో కలెక్టర్ నయీం అస్మి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. ప్రశంసా పత్రాలను అందుకుంటున్న జిల్లా స్థాయి అధికారులలో వరసగా.. డీఆర్‌వో ఎస్.వెంకటేశ్వరులు, భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తాడేపల్లిగూడెం ఆర్డీవో కౌసర్ భానో, జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, పశుసంవర్థక శాఖ అధికారి కె.మురళీకృష్ణ, జిల్లా పౌర సరఫరాలశాఖ మేనేజర్ ఎం.ఇబ్రహీం, డీఈవో ఈ.నారాయణ, వయోజన విద్య డీడీ సీహెచ్ ప్రభాకర్, దేవదాయ శాఖ అధికారి వి.హరి సూర్యప్రకాశ్, జిల్లా ఫైర్ ఆఫీసర్ బి.శ్రీనివాసరావు, జిల్లా జౌళి, చేనేత శాఖ అధికారి కె.అప్పారావు, హౌసింగ్ పీడీ జి.పిచ్చయ్య, జిల్లా పరిశ్రమల శాఖాధికారి యు.మంగపతి, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎ.లక్ష్మి, డీఎంహెచ్‌వో జి.గీతాబాయి, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎ.వెంకట అప్పారావు, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి కె.శ్రీనివాసరావు, భీమవరం డీఎస్పీ ఆర్‌జే సూర్య, నరసాపురం డీఎస్పీ శ్రీ వేద.

• నాకు నెలకు రూ.1,200 ఆదా



నేను ఉద్యోగం నిమిత్తం రోజూ యండగండి నుంచి భీమవరం విష్ణు కళాశాలకు వెళ్లి వస్తుంటాను. ఇందుకు రోజుకు రూ.40 చొప్పున నెలకు రూ.1200 ఖర్చు అవుతుంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ ఇప్పుడు స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రవేశపెట్టారు. దీనితో నెలకు ఆ మొత్తం ఆదా అవుతుంది. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.
- వరలక్ష్మి, యండగండి(ఉండి)

• తణుకు నుంచి ఫ్రీగా ప్రయాణం



ఆర్టీసీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం చాలా బాగుంది. గురువారం మా ఊరి నుంచి తణుకు పెళ్లికి వెళ్లాను. శుక్రవారం మధ్యాహ్నం అక్కడ పాలకొల్లు బస్సు ఎక్కడంతో కండక్టర్ ఫ్రీ టిక్కెట్ ఇచ్చారు. జీవితంలో తొలిసారి డబ్బులు లేకుండా ప్రయాణం చేయడం చాలా హ్యాపీగా వుంది. పాలకొల్లు నుంచి మావూరికి బస్సులు లేకపోవడంతో ఆటోలో రావాల్సి వచ్చింది. మారుమూల గ్రామాలకు బస్సులు వేయాలి.
- గుడ్లవల్లేటి వెంకట అలివేలు మంగతాయారు, చింతపర్రు(పాలకొల్లు)

హ్యాపీ జర్నీ







మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణాన్ని పాలకొల్లులో ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల, అంగర, భీమవరంలో బస్సులో ప్రయాణిస్తున్న కలెక్టర్ నాగరాణి, పీతల, తోట, చిత్రంలో ఎమ్మెల్యే అంజిబాబు

రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన సూపర్‌సిక్స్‌లో మరో పథకం అమలులోకి వచ్చింది. స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని జిల్లాలో ప్రజా ప్రతినిధులు, అధికారులు అట్టహాసంగా ప్రారంభించారు. పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు, ఆకివీడులో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, భీమవరంలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు, కలెక్టర్ నాగరాణి, తాడేపల్లిగూడెంలో ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ ఇన్‌ఛార్జ్ వలవల బాబ్జి, తణుకు, ఆచంట, నరసాపురంలలో ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ, పితాని సత్యనారాయణ, నాయకర్, టీడీపీ ఇన్‌ఛార్జ్ పొత్తూరి రామరాజు మహిళలకు ఉచిత బస్సును ప్రారంభించారు. సాయంత్రం నుంచి ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో వారికి ఉచిత ప్రయాణం కల్పించారు. ఉచిత టిక్కెట్ ఇవ్వడంతో మహిళలు ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. ప్రభుత్వంపై తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లాలో మూడు రకాల బస్సుల్లో రాష్ట్రంలో ఎంత దూరమైనా మహిళలు, ట్రాన్స్‌జెండర్‌లు ఉచిత ప్రయణానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆధార్, పాన్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఇలా వివిధ రకాల ఫోటో గుర్తింపు కార్డులు చూపించిన వారికి ఉచిత టిక్కెట్ ఇచ్చారు.



తణుకు బస్సులో మహిళలతో కలిసి ఎమ్మెల్యే ఆరిమిల్లి ప్రయాణం



ఉంగుటూరు నుంచి ఏలూరు వెళ్లే ఆర్టీసీ బస్సును నడుపుతున్న గన్ని

సూపర్ సిక్స్.. సూపర్ హిట్

పాలకొల్లు టౌన్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలులో కూటమి ప్రభుత్వం సూపర్ హిట్ అయ్యిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాలలో శుక్రవారం మహిళల ఉచిత ప్రయాణ బస్సును మంత్రి నిమ్మల ప్రారంభించారు. మహిళలతో కలిసి బస్సులో పాలకొల్లు వరకూ ప్రయాణించారు. బల్లిపాడు, దగ్గులూరు, లంకలకోడేరు, భగ్గేశ్వరం, పూలపల్లి మీదుగా వచ్చిన బస్సుకు మహిళలు పూలు జల్లి, హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. మహిళా ప్రయాణికులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, నేతలు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, కోడి విజయభాస్కరరావు, బోనం చినబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక తోడ్పాటుకు స్త్రీ శక్తి దోహదం : కలెక్టర్

భీమవరంటౌన్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): నాడు సీఎం చంద్రబాబు డ్వాక్రా సంఘాల ఏర్పాటు ద్వారా మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పడ్డారు. నేడు ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం ద్వారా సాంఘికంగా, ఆర్థికంగా మరింత పురోభివృద్ధి సాధించనున్నారు' అని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. భీమవరం ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో శుక్రవారం మహిళల కోసం స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఆటో కార్మికులకు ఏ విధమైన నష్టం జరగదన్నారు. ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పులవర్తి రామాంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసమే నిరంతరం ఆలోచన చేస్తుందన్నారు. రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పీతల సుజాత, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడారు. జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రజారవాణాధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్, మెంటే పార్థసారధి, తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్‌గా మారిన రఘురామ

ఆకివీడు రూరల్/ఉండి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి):ఆకివీడు మండలం దుంపగడప వద్ద 165 జాతీయ రహదారిపై నూతన బస్టాండ్‌ను, స్త్రీ శక్తి ఉచిత బస్సు సర్వీసును డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు శుక్రవారం ప్రారంభించారు. అదే బస్సులో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజుతో కలిసి ఉండి వరకు ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన కండక్టర్ వద్ద వున్న టికెట్ మిషన్ తీసుకుని కొద్దిసేపు కండక్టర్‌గా మారారు. మహిళలకు ఫ్రీ టిక్కెట్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కూటమి ప్రభుత్వం మహిళా పక్షపాతి ప్రభుత్వం. స్త్రీ శక్తి పథకంలో మహిళల్లో ఆనందానికి అవధులు లేవు. బస్సు ఎక్కిన ప్రతి మహిళ తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అన్న మాట ప్రకారం ఈ పథకాన్ని ప్రారంభించింది. ఉపాధిలో భాగంగా ప్రయాణ ఖర్చులు నష్టపోకుండా మహిళలకు, చదువుకునే విద్యార్థినిలకు ఈ ఉచిత బస్సు ఎంతో మేలు చేస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం నిమిత్తం రూ.2 వేల కోట్లు మంజూరుచేసింది. జిల్లాలో 225 పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులను ఈ పథకంలో వినియోగిస్తోంది. వీటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు వివిధ పథకాలను ప్రవేశపెట్టి వారి పురోభివృద్ధికి పాటు పడుతోంది' అని అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మోటుపల్లి రామవరప్రసాద్, ఏఎంసి చైర్మన్ బొల్లా వెంకట్రావు, దాత పిన్నమరాజు శ్రీనివాసరాజు, సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు, ముత్యాల రత్నం, గొట్టుముక్కల సత్యనారాయణరాజు, మురళీరాజు, గవరలక్ష్మీ, బొత్స సరళాకుమారితదితరులు పాల్గొన్నారు.



ఖాతాలు సరిచేయిస్తేనే..

- మరో 2,039 మంది రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ములు జమ
- విదేశాల్లో వున్నవారిని రప్పిస్తున్న అధికారులు

భీమవరం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ సొమ్ములు అర్హులైన మరో రెండు వేల 39 మంది ఖాతాలకు జమ చేయాల్సి వుందని అధికారులు గుర్తించారు. గల్ఫ్ తదితర విదేశాల్లో వున్న ఈ రైతులకు ఇక్కడ బ్యాంకు ఖాతాలు పనిచేయకపోవడం, నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) పోర్టల్‌తో అనుసంధానం కాకపోవడంతో సొమ్ములు జమకాలేదు. జిల్లాలో ఈ పథకానికి 1,05,800 మంది రైతులు అర్హులు కాగా, 1,03,761 మంది ఖాతాలు సక్రమంగా ఉన్నాయి. వారందరికీ తొలి విడతగారాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్రం రూ.2 వేలు చొప్పున రూ.70.13 కోట్లు జమచేసింది. మిగిలిన రెండు వేల 39 మందికి జమ చేసేందుకు, వివిధ ప్రాంతాల్లో వున్న వారిని అధికారులు ఇక్కడకు రప్పించి వారి బ్యాంకు, ఎన్‌పీసీఐ ఖాతాలను సరిచేయిస్తున్నారు. ఈ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత కొత్తగా మరో 491 మంది రైతులు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 471 దరఖాస్తులు పరిశీలించి 391 మంది ఈ పథకానికి అర్హులుగా నిర్ధారించారు. వీరికి త్వరలోనే సొమ్ములు జమ కానున్నాయి. మూడు దరఖాస్తులను తిరస్కరించగా, మరో 77 మంది వివరాలను పరిశీలిస్తున్నారు.

వీడని ముంపు

- రెండు రోజులుగా నీటిలోనే నానుతున్న పొలాలు



పెనుగొండలో చెరువును తలపిస్తున్న పొలాలు

తాడేపల్లిగూడెం/పెనుగొండ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి):వర్షాలకు మునిగిన వరి పొలాలు తేరుకోవడం లేదు. రెండు రోజులుగా నీటిలో మునిగి ఉన్నాయి. ఇప్పటికే మందులు వేసిన రైతులు ఖరీఫ్ పంటపై ఆశ వదులుకోవాలేమోనని ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు రూ.20 వేల వరకు పెటుబడి పెట్టారు. తీరా వరుణుడు వెంటాడి ముంచేశాడు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కనీసం నీరులాగిన తరువాత తిరిగి నాట్లు వేసుకోవాలన్నా నారు దొరకని పరిస్థితి. పంట చేలో మురుగుపోయే డ్రైనేజ్‌లు సరిగా తవ్వకపోవడం వల్ల ఇలాంటి పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విచ్చల విడిగా చేపలు, రొయ్యలు చెరువులు తవ్వేయడం వల్ల కూడా డ్రైన్లు మూసుకుపోయాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల పొలాల పరిస్థితి మరింత దారుణంగా మారింది. డెల్టా ప్రాంతంలో మురునీరు పోయేందుకు కోడులు(పెద్ద డ్రైన్లు) ఉంటాయి. కాని ఇవి ప్రస్తుతం ఇవి ఆక్రమణలకు గురై కుచించుకుపోయాయి. దీంతో మురుగు నీరు త్వరగా వెళ్లే మార్గం లేక పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది.



కాకర్లమూడిలో నీట మునిగి ఉన్న వరిపొలాలు

ఎగదన్నుతున్న నీరు

పెనుగొండ మండలంలో భారీ వర్షం తగ్గి రెండు రోజులు కావస్తున్న ముంపులోనే పొలాలు ఉన్నాయి. ఒకటి, రెండు రోజులు నీటిలో వరి నాట్లు ఉంటే పర్వాలేదు.. కాని నీరు ఎటూ పారకుండా అలాగే ఉంటే నాట్లు కుళ్ళిపోతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. నీరు ఎటూ వెళ్ళడం లేదని, నక్కల కాలువలోని నీరు లాగడం లేదని, పైగా డ్రెయిన్ నీరు పొలాల్లోని ఎగదన్నుతుందని రైతులు చెబుతున్నారు. ఇంతలా ఉన్నా అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని ఇలా కన్నెత్తి చూడలేదని తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పులు.. ఆత్మహత్యలు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి బలవన్మరణం

కొయ్యలగూడెం/ఏలూరు క్రైం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి):చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక ఒక యువకుడు, ఇచ్చిన అప్పులు తిరిగి ఇవ్వకుండా అడ్డం తిరుగుతున్నారని మరో వ్యక్తి ఆత్మహత్యలు చేసుకున్నారు. వివరాలివి.. పాలకోడేరు మండలం పెన్నాడకు పోతుమని నాగరాజు (35)కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు. అవసరాల నిమిత్తం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఈ నెల 14న పురుగు మందు తాగాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి మార్చురీకి తరలించారు.

మరో ఘటనలో కొయ్యలగూడెం మండలం కన్నాపురానికి చెందిన మజ్జి రామకృష్ణ మోటారు మెకానిక్‌గా పని చేస్తున్నాడు. సంపాదించుకున్న దానిలో కొంత తెలిసిన వారికి అప్పుగా ఇచ్చాడు. ఎన్నిసార్లు అడిగినప్పటికీ తీసుకున్న వారు ఇవ్వకపోవడంతోపాటు ఎదురు తిరగడంతో అవాక్కయ్యాడు. దీనికితోడు తాను కూడా ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతుండడంతో తీవ్ర మనోవేదనకు లోనై గురువారం రాత్రి నూతిలోకి దూకాడు. తాను చనిపోతున్నట్లు కుటుంబ సభ్యులకు వాట్సప్ మేసేజ్ పెట్టడంతో వారు ప్రమాద స్థలానికి వెళ్లే సరికి నూతిలో పడిపోయాడు. బయటకు తీసేలోగా మృతి చెందినట్లు కొయ్యలగూడెం ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జాతీయ జెండాకు వందనం




ఏలూరు, భీమవరం కలెక్టరేట్‌లలో..

ఏలూరు సిటీ/భీమవరం టౌన్ ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సమన్వయంతో జిల్లా సమగ్ర అభివృద్ధిని సాధిద్దామని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా కలెక్టర్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జేసీ ధాత్రిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, కలెక్టరేట్ ఏవో నాంచా రయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. భీమవరం కలెక్టరేట్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణి జాతీయ జెండా ఆవిష్కరించి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఏలూరు రేంజ్ కార్యాలయంలో ఐజీ అశోక్ కుమార్

ఏలూరు క్రైం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్యం ద్వారా వచ్చిన హక్కులను పరిరక్షిస్తూ ప్రజలకు పోలీసులు మెరుగైన సేవలు అందించడం కోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ సూచించారు. ఏలూరు రేంజ్ కార్యాలయం వద్ద ఐజీ జెండా ఎగురవేశారు.



ఏలూరు జిల్లా కోర్టులో జడ్జి శ్రీదేవి..

ఏలూరు జిల్లా కోర్టుపై జాతీయ జెండాను జిల్లా జడ్జి శ్రీదేవి ఆవిష్క రించారు. అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో సమ న్యాయం అందించే బాధ్యత న్యాయశాఖపై ఉందని ప్రతిఒక్కరు నిజాయితీగా విధులను నిర్వర్తించాలని సూచించారు. న్యాయమూర్తులు, న్యాయ వాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.




ఏలూరు, భీమవరం ఎస్పీ కార్యాలయాల్లో..

ఏలూరు క్రైం/ భీమవరం క్రైం : స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులను ఆదర్శంగా తీసుకుకోవాలని ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ సూచించారు. ఏలూరు ఎస్పీ క్యాంపు కార్యాలయం వద్ద ఆయన జేసీ ధాత్రి రెడ్డితో కలిసి జెండా వందన కార్యక్రమాన్ని నిర్వహించి స్వీట్లు పంచారు. భీమవరం ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి జాతీయ జెండాను ఎగురవేశారు. స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

జిల్లా పరిషత్ కార్యాలయంలో..

ఏలూరుసిటీ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరులోని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ జెండా ఆవిష్కరించారు.జిల్లా పరిషత్‌లో ఉత్తమ పనితీరు కనబరిచిన 108 మంది ఉద్యోగులకు జడ్పీ చైర్‌పర్సన్ ప్రశంసా పత్రాలను అందజేశారు. జడ్పీ సీఈవో శ్రీహరి, డిప్యూటీ సీఈవో భీమేశ్వర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ నిట్‌లో..



తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరూ జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని ఏపీ నిట్ డీన్ రిసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీ.రవికిరణ్ శాస్త్రి అన్నారు. నిట్‌లో ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ రమణారావు ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ హిమబిందు, డాక్టర్ సందీప్, డాక్టర్ జయరాం, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, డాక్టర్ శ్రీనివాసన్ పాల్గొన్నారు

పెదకృష్ణంరాజుకు విశిష్ట సేవా అవార్డు



పెంటపాడు, ఆగస్టు 15 (ఆంధ్ర జ్యోతి): అలంపురంలో శ్రీవెంకటరమణ సేవా చారిటబుల్ ట్రస్టు పేరుపై ఆసుపత్రిని ఏర్పాటు చేసి పేద, మధ్య తరగతి ప్రజలకు ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న ట్రస్టు చైర్మన్ డాక్టర్ కొలనువాడ పెద కృష్ణంరాజును మరో అవార్డు వరించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా విశిష్ట సేవా అవార్డు అందుకున్నారు.





భీమవరం వేడుకల్లో వ్యవసాయ శాఖ శకటం



భీమవరంలో విద్యార్థుల ప్రదర్శన

జయహో భారత్

79వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు ఉమ్మడి జిల్లా అంతటా ఉత్సాహంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాల యాల్లో జాతీయ జెండా ఎగురవేసి వందనం సమర్పించారు. ఏలూరు, భీమవరం పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రభుత్వ విభాగాలు తమ అభివృద్ధిని తెలియజేస్తూ శకటాలను ప్రదర్శించారు.

ఉత్సాహంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవం

ఆకట్టుకున్న శకటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు

ఏలూరు రూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో నిర్వహించిన వేడుకల్లో నూజివీడుకు చెందిన త్రివిధ ఉన్నత పాఠశాల 60 మంది విద్యార్థినీ, విద్యార్థులతో ప్రదర్శించిన "వందనాలు, వందనాలు..వీర భారతీపుత్రులారా" అంటూ ప్రదర్శించిన నృత్య ప్రదర్శన, భీమడోలు మండలం పొలసానిపల్లికి చెందిన ఏపీ సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన "జయహో" ప్రదర్శన, ఏలూరులోని కస్తూరిబా మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 225 మంది విద్యార్థినులు ఇటీవల పెహల్గామ్‌లో ఉగ్రదాడి, అనంతరం భారత సైన్యం "ఆపరేషన్ సిందూర్" పేరుతో టెర్రరిస్టులను మట్టుపెట్టిన సంఘటనతో రూపొందించిన ప్రదన్శనకు సభికులంతా కరతాళధ్వనులు చేశారు.గోపన్నపాలెం ఎస్ఎస్ఆర్ ప్రభుత్వ వ్యాయమ ఉపాధ్యాయ శిక్షణా కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన "మాల్కం" విన్యాసాలు ఆకట్టుకున్నాయి. దీనికి మొదటి బహుమతి రాగా నూజివీడుకు చెందిన రైట్స్ సంస్థకు చెందిన బాలికలు ప్రదర్శించిన "హం ఇండియా వాలే" ప్రదర్శన రెండో బహుమతి, ఏలూరులోని కస్తూరిబా పాఠశాల "ఆపరేషన్ సిందూర్" ప్రదర్శనకు మూడో బహుమతి, కలిదిండి పబ్లిక్ స్కూల్‌కి వందే మాతరం నృత్య ప్రదర్శనకు నాల్గవ బహుమతి లభించాయి.

భీమవరం టౌన్, (ఆంధ్రజ్యోతి) : భీమవరం పెరేడ్ గ్రౌండులో శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలలు ఆకట్టుకున్నాయి. జిల్లా విద్యాశాఖ ప్రథమస్థానం, పశుసంవర్ధక శాఖ ద్వితీయస్థానం, వైద్య ఆరోగ్య శాఖకు తృతీయ స్థానాలు లభించాయి.వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాలకొల్లు భారతీయ విద్యాభావన్స్ విద్యార్థుల వందేమాతరం, భీమవరం ఏఆర్‌కెఆర్ మున్సిపల్



హైస్కూల్ విద్యార్థుల జై జవాన్.. జై కిసాన్, భీమవరం ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన జగతి సిగలో జాబిల మ్మకు వందనం, తణుకు రూట్స్ పాఠశాల విద్యార్థుల వందే మాతరం, పెనుగొండ ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిను హర్ ఘర్ తిరంగా, తణుకు మాంటిస్సోరి విద్యార్థులు ప్రదర్శించిన ఇది మన భారతయ, భీమవరం పీఎస్ఎం మున్సిపల్ హైస్కూల్, భీమవరం వైష్ణవి అకాడమీ, కాళ్ల వెస్ట్ బెర్రీ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు. ఆకట్టుకున్నాయి. తణుకు రూట్స్ విద్యార్థుల ప్రదర్శించిన వందేమాతరం ప్రథమ స్థానం, పెనుగొండ విద్యార్థులు ప్రదర్శించిన హర్ ఘర్ తిరంగా ప్రదర్శనకు ద్వితీయస్థానం, భీమవరం ఏఆర్‌కేఆర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు జై జవాన్..జై కిసాన్ ప్రదర్శనకు తృతీయస్థానం లభించాయి.



విద్యార్థుల బ్యాండ్ విన్యాసాలు



ఏలూరులో జరిగిన వేడుకల్లో మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన ప్రదర్శనలు






భీమవరంలో జరిగిన వేడుకల్లో రెండు, మూడు బహుమతులు సాధించిన 'హర్ ఘర్ తిరంగా, జై జవాన్ జై కిసాన్..' ప్రదర్శనలు



భీమవరం మావుళ్లమ్మ ఆలయం వద్ద సామూహిక పూజల్లో భక్తులు

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

భీమవరం టౌన్/ పెంటపాడు/ పెనుగొండ/ తాడేపల్లిగూడెం రూరల్ ,ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం శుక్రవారం పురస్కరించుకుని దేవస్థానం ఆధ్వర్యంలో మావుళ్ళమ్మ ఆలయం వద్ద సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. దాదాపు వెయ్యి మంది మహిళలు పాల్గొన్నారు. భక్తులకు మావుళ్ళమ్మ అమ్మ వారి పుట్టింటివారు మెంటే వంశస్తులు చీరలు బహూకరించారు. ఈవో బుద్ధా మహాలక్ష్మి నగేష్ పర్యవేక్షించారు. ప్రత్తిపాడు వై.జంక్షన్ కనక దుర్గమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. పెనుగొండ వాసవీ మాత ఆలయంలో వరలక్ష్మి పూజ వేడుకగా నిర్వహించారు. సుమారు 600 పైగా మహిళలు పాల్గొ న్నారు. తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురం గ్రామ దేవత చల్లాలమ్మ ఆలయం వద్ద సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. అమ్మవారికి గాజులతో ప్రత్యేక అలంకరణ చేశారు.



ప్రత్తిపాడు కనకదుర్గమ్మ ఆలయంలో..



నీలాద్రిపురం చల్లాలమ్మ ఆలయంలో..



పెనుగొండ వాసవీమాత ఆలయంలో..

జుత్తిగ అమ్మవారి ఆలయంలోకి వరద నీరు



పెనుమంట్ర, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పెనుమంట్ర మండలంలో ప్రధానంగా ప్రవహించే గోస్తనీ నది పోటెత్తడంతో జుత్తిగ కామాక్షి అమ్మవారి ఆలయంలో వరదనీరు చేరింది. శ్రావణ శుక్రవారం అమ్మవారిని దర్శించుకునేందుకు వెళ్లిన మహిళా భక్తులుకు అంతరాయం ఏర్పడింది. వరద నీటిలోనే అమ్మవారిని దర్శించుకున్నారు.



గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం భవన శంకుస్థాపనలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే ఆరిమిల్లి తదితరులు

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం భవనానికి శంకుస్థాపన

భీమవరం టౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : భీమవరంలో మావుళ్ళమ్మ గుడి దగ్గరలోఉన్న గ్రామ కచేరి చావిడి స్థలంలో జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ భవన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు రాజ్యసభ సభ్యుడు పాక సత్యనారాయణ, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, రాష్ట్ర మహిళా ఆర్థిక సాధికార కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత తదితరులు పాల్గొన్నారు.

చినవెంకన్నను దర్శించుకున్న మంత్రి పార్థసారథి



చిత్రపటం అందచేస్తున్న ఈవో మూర్తి

ద్వారకాతిరుమల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ, సమా చార పౌర సం బంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామిని శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖమండపంలో అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు. ఈవో మూర్తి స్వామి,అమ్మవార్ల చిత్రపటం,ప్రసాదాలను అందజేశారు.



కేకును కట్ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

ఘనంగా ఎమ్మెల్యే ముప్పిడి జన్మదిన వేడుకలు

కొవ్వూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంటమణి రామకృష్ణారావు, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, నారాయణ, శ్రీనివాసరావు, మద్దిపట్ల సురేష్, ఆళ్ల హరిబాబు,సురేష్, గెల్లా సురేష్, రంగారావు, సుబ్బారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల మండలం సూర్యచంద్రరావుపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకుడు

డివైడర్‌ను ఢీకొట్టి యువకుడి మృతి

ద్వారకాతిరుమల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రహదారిపై ముందు వెళ్తున్న మోపెడ్‌ను తప్పించబోయి అదుపుతప్పిన బైక్ డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తలపగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మోపెడ్‌పై వెళ్తున్న మరో వ్యక్తి కంగారుపడి రోడ్డుపై పడటంతో తీవ్రగాయాలపాలయ్యాడు. ఈఘటన మండలంలోని సూర్యచంద్రరావు పేటలో శుక్రవారం సాయంత్రం జరిగింది. భీమడోలుకు చెందిన మీసాల జగదీష్ (23)ద్వారకాతిరుమలలోని ఓ స్వీట్‌షాప్‌లో పనిచేస్తున్నాడు. ఉదయం డ్యూటీకి వచ్చిన జగదీష్ ఆరోగ్యం బాగోలేదని స్వగ్రామానికి మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. ఘటనాస్థలం వద్దకు వచ్చేసరికి ముందువెళ్తున్న మోపెడ్‌బండిని ఓవర్ టేక్ చేసే సమయంలో బైక్ అదుపుతప్పి వేగంగా డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో జగదీష్ తలకుతీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మోపెడ్‌పై వెళ్తున్న పాకలపాటి ఫణీంద్ర కంగారుపడి కింద పడిపోవడంతో తీవ్రగాయలయ్యాయి. అతన్ని అంబులెన్స్‌లో భీమడోలు ఆసుపత్రికి తరలించారు. ద్వారకాతిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు.

మోటారు సైకిల్‌ను ఢీకొట్టిన కారు..ఒకరి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బుర్ల మహేష్ కుమార్ (ఫైల్ ఫోటో)

ఉంగుటూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై కైకరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. నారాయణపురంలోని ఒక ఫ్యాక్టరీలో విధి నిర్వహణ నిమిత్తం వెళు తున్న మోటారు సైక్లిస్టును వెనుక నుంచి ఎర్టిగా కారు ఢీకొనడంతో మోటారు సైక్లిస్టు అక్కడికక్కడే మృతి చెందాడు. చేబ్రోలు పోలీసుల కథనం ప్రకారం భీమడోలు మండలం మల్కీ మహ్మద్‌పురం గ్రామానికి చెందిన బుర్ల మహేష్ కుమార్ శుక్రవారం ఉదయం నారాయణపురం వెళుతుడగా కైకరం శివారులో ద్వారకా తిరుమల నుంచి తణుకు వెళుతున్న ఎర్టిగా కారు వెనుక నుంచి ఢీకొట్టి పక్క నున్న పంట బోదెలోకి దూసుకుపోయింది. మోటారు సైక్లిస్టు మహేష్ కుమార్ (37) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చేబ్రోలు ఎస్ఐ మామిడాల సూర్య భగవాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఫిట్స్‌తో పంట బోదెలో పడి..

పెనుమంత్ర, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): పంట బోదెలో మోటారు ఇంజన్ ఏర్పాటు చేసేందుకు గొయ్యి తవ్వుతుండగా ఫిట్స్ రావడంతో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ ఎం.సత్యనారాయణ తెలిపారు. గురువారం బ్రాహ్మణ చెరు వు ఓఎన్.జీసీ రిగ్గు వద్ద పంట పొలం బోదెలో పడి మృతి చెందినట్లు తెలిపారు. ఆచంట గ్రామానికి చెందిన వంద నవు బాలాజీ(40)గా పోలీసులు గుర్తించారు.



మార్టేరులో స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పితాని.. నరసాపురంలో ప్రారంభిస్తున్న విప్ నాయకర్, షరీఫ్, పొత్తూరి.. తాడేపల్లిగూడెంలో రిబ్బన్ కట్ చేస్తున్న విప్ బొలిశెట్టి

పోక్సో కేసు నమోదు

నరసాపురం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో తొమ్మిది సంవత్సరాల బాలికపై అత్యాచారానికి పాల్పడిన సంఘటన ఈనెల 13న జరిగింది. వివరాల ప్రకారం బాలిక తల్లిదండ్రులు వ్యవసాయ పనికి వెళ్ళి ఇంటికి తిరిగి వచ్చే సరికి తమ కుమార్తె ఇంటి వద్ద కనిపించలేదు. వెతకగా ఇంటి సమీపంలోని కుడిపూడి నాగ బాలాజీ అనే 30 సంవత్సరాలు గల వ్యక్తి ఇంటి వద్ద బాలిక ఉంది. బాలాజీ ఇంటికి తీసుకువెళ్ళి అత్యాచారానికి పాల్పడ్డాడు. పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు.

అట్టహాసంగా మహిళల ఉచిత బస్సులు ప్రారంభం

పెనుమంత్ర, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా చంద్రబాబు సర్కార్ స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేస్తున్నాదని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మార్టేరు సెంటర్‌లో స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించి ఉచిత ఆర్‌టీసీ బస్సులో మహిళలతో కలిసి ప్రయాణం చేశారు. మహిళలకు మేలు చేసేది కూటమి ప్రభుత్వం అని అన్నారు.

నరసాపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. శుక్రవారం మహిళలకు ఉచిత బస్సును ఆయన ప్రారంభించి కొంత దూరం ఆయనే స్వయంగా బస్సును నడిపారు. ప్రభుత్వ మైనార్టీ సలహాదారు షరీఫ్, పోత్తూరి,కమిషనర్ అంజయ్య, డీఎం సుబ్బన్న రెడ్డి, వలవల నాని, కొప్పాడ రవి పాల్గొన్నారు.

తణుకు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం నెరవేర్చుతున్నదని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం తణుకు ఆర్టీసీ డిపోలో స్త్రీ శక్తి మహిళా ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించి మహిళలతో కలిసి ఆయన ప్రయాణించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు కారణంగా ప్రభుత్వంపై నెలకు రూ.162 కోట్ల భారం పడుతుందన్నారు. తణుకు డిపో పరిధిలో 61 బస్సులు ద్వారా మహిళలకు 16 రూట్లలో ఉచిత బస్సు ప్రయాణం పొందవచ్చన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: కూటమి ప్రభుత్వం మహిళలకు అన్ని అంశాల్లో పెద్దపీట వేస్తున్నదని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం ఆర్టీసి డిపో వద్ద మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం వల్ల ఇబ్బంది పడే ఆటో వర్కర్స్‌కు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఏడీఎం సుధారాణి, నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లకు అవార్డులు



ఎం. బాబూరావు, ఎం. అప్పారావు

భీమవరం క్రైం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): భీమవరం వన్‌టౌన్ స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ మూల బాబూరావుకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఉత్కృష్ట అవార్డును శుక్రవారం స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. ఉత్తమ సేవలకుగాను ఈ అవార్డు తనకు దక్కిందని ఆయన తెలిపారు. అలాగే జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్‌గా పని చేసున్న ఎం.అప్పారావుకు ఉగాది పురస్కారం దక్కింది. ఈ అవార్డును రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చేతుల మీదుగా ఆయన అందుకున్నారు.

ఉపకార వేతనాలు పంపిణీ

తణుకు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పీ4 విధానంలో దాతలు మార్గదర్శకులు కావాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం కమ్మ కల్యాణ మండపంలో కాకతీయ సంఘం, బండా పట్టాభీ సంక్షేమ సంఘం సంయుక్తంగా విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 215మంది విద్యార్థులకు రూ.23.95 లక్షలు అంద జేస్తున్నట్లు వివరించారు.



పురస్కారం అందుకుంటున్న జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సామంతపూడి శ్రీరామరాజు

రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌కు సేవా పురస్కారం

భీమవరం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మరో పర్యాయం ఉత్తమ సేవా పురస్కారం సొంతం చేసుకున్నది. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా జిల్లా మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సామంతపూరి శ్రీరామరాజు, కొత్త శ్రీనివాస్‌లు పురస్కారాన్ని అందుకున్నారు. విపత్తుల్లో మిల్లర్స్ అసోసియేషన్ సేవలను మంత్రి కొనియాడారు.

ఏఎంసీ చైర్మన్ శ్రీమన్నారాయణ బాధ్యతలు



నరసాపురం రూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌యార్డు చైర్మన్‌గా జక్కం శ్రీమన్నారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆనంతరం ప్రాంగణంలో ఉపాధ్యక్షులు గంగాధర్, పాలకవర్గం సభ్యులతో కలిసి జాతీయ జెండాను ఎగుర వేశారు. పీఎంలంక సొసైటీ అధ్యక్షులుగా పులపర్తి సూర్యరావు, సభ్యులుగా కోడి వీరవెంటక సత్యానారాయణ, పొన్నమండ ముత్యాలరాజుల చేత కార్యదర్శి నాని బాధ్యతలు చేపట్టించారు.





పెంటపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్.. తాడేపల్లిగూడెం టీడీపీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసిన వలవల బాబ్జి.. భీమవరంలో జాతీయ జెండా ఎగురవేసిన తోట సీతారామలక్ష్మి

మువ్వన్నెల రెపరెపలు

బైక్ ర్యాలీలు, త్రివర్ణ పతాకాలతో ప్రదర్శనలు

ఘనంగా 79వ స్వాతంత్ర్య వేడుకలు



తణుకు మాంటిస్సోరి స్కూల్‌లో జెండా ఆవిష్కరిస్తున్న స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు

జిల్లా అంతటా స్వాతంత్ర్య వేడుకల్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. పార్టీల కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, కాలేజీలు, స్కూళ్లు, కార్మిక యూనియన్ల ఆధ్వర్యంలో జాతీయ జెండాలను నాయకులు, అధికారులు ఎగురవేశారు. బైక్ ర్యాలీలు, జాతీయ జెండాలతో ప్రదర్శన చేశారు. పాఠశాలల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



తణుకు ఎస్‌కేఎస్‌డీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీవీవీఎస్ వర్మ

నరసాపురం టౌన్, ఆగస్టు 15: జనసేన పార్టీ కార్యాలయం వద్ద ప్రభుత్వ విప్ నాయకర్ జెండాను ఎగుర వేశారు. ప్రభుత్వ మైనార్టీ సలహాదారు ఏంఏ షరీఫ్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార అభివృద్ధి, సంక్షేమ చైర్మన్ కొల్లు పెద్దిరాజులు పార్టీ కార్యాలయాలు, వివిధ కూడళ్లల్లో జాతీయ జెండాలను ఎగుర వేశారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు ఆధ్వర్యంలో రుస్తుంబాదా నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రాయపేటలోని పార్టీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, వైసీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు, సీతారాంపురం లేసు పరిశ్రమలో ప్రభుత్వ విప్ నాయకర్, కలవకొలను తాతాజీ,లు జాతీయ జెండాలను ఎగుర వేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో దాసి రాజు జెండాను ఎగుర వేశారు. డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీవేద, కోర్టు ప్రాంగణంలో జిల్లా అదనపు న్యాయమూర్తి రాజ్యలక్ష్మి, టౌన్ స్టేషన్‌లో సీఐ యాదగిరి, రూరల్‌లో సీఐ దుర్గాప్రసాద్ జాతీయ జెండాలు ఎగుర వేశారు.

పెంటపాడు/తాడేపల్లిగూడెం అర్బన్: పెంటపాడులో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల వద్ద ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ రవికుమార్ జెండాను ఎగుర వేశారు. తాడేపల్లిగూడెం పట్టణంలో టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు పాల్గొన్నారు.

ఆచంట: ఆచంట ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి, వల్లూరు పీహెచ్‌సీ వద్ద సురేష్‌బాబు, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, పోలీసు స్టేషన్ వద్ద ఎస్ఐ కె. వెంకట రమణ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఎస్ఆర్‌వో కె. వెంకటపతిరాజు జాతీయ జెండాలు ఎగుర వేశారు. మన ఊరు అసోసియేషన్ ఆధ్వర్యంలో కొడమంచిలి జిల్లా పరిషత్ హైస్కూలులో పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు పొందిన విద్యార్థులకు కొరిపల్లి లక్ష్మీనారాయణ, బుల్లిమ్మల మనుమడు నెక్కంటి రవీంద్రనాద్ ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందించారు.

మొగల్తూరు: రామన్నపాలెం, కెపి పాలెం ఉన్నత పాఠశాలల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, గాంధీ బొమ్మల సెంటర్‌లో వేర్వేరుగా జిల్లా వైసీపీ అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ విభాగం సలహదారు ఎం.ఏ షరీఫ్, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు జాతీయ పతాకాలు ఎగురవేశారు.

పెనుగొండ: స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. 79వ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా పెనుగొండ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

పెనుమంట్ర: మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాభి వృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. పెనుమంట్ర మండలంలో ఎమ్మెల్యే జాతీయ జెండాలు ఎగురవేశారు.

భీమవరం రూరల్: దంతులూరి నారాయణరాజు కళాశాలలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి విద్యార్థుల, ఎన్‌సీసీ కేడెట్ల గౌరవ వందనాన్ని పాలకవర్గ అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు స్వీకరించారని కళాశాల ప్రిన్సిపాల్ జి.మోజెస్ తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థి, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ గౌరవ అతిథిగా విచ్చేశారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యక్షుడు ఎస్‌వీ రంగరాజు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యాసంస్థల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ జాతీయ జెండా ఆవిష్కరించారు. కొత్తపూసలమూరు గ్రామంలో టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి జాతీయ జెండా ఎగురవేశారు. డాక్టర్ సీఎస్ఎన్ విద్యా సంస్థల్లో కళాశాల ఫౌండర్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా. చీడే సత్యనారాయణ పతాకావిష్కరణ చేశారు.



రాయపేటలో జెండా ఎగురవేసిన మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడు

ఉండి: ఉండి మార్కెట్ యార్డులో చైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ యడవల్లి వెంకటేశ్వరరావు, సభ్యులు ఆరేపల్లి నాగలక్ష్మీ, బండి నాగరాజు, సందాక నాగశాంతి, చింతాడ నాగసుశీల, గేదెల కుమారి, శీలం లక్ష్మీపార్వతి, లంక మావుళ్ళ, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, నిచ్చెనకొలన సత్యవతి పాల్గొన్నారు. ఉండి పెద్దవంతెన సెంటర్‌లో నరసాపురం మాజీ పార్లమెంట్ సభ్యుడు కనుమూరు బాపిరాజు ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ నాయకుల విగ్రహాల వద్ద వేడుకలు ఘనంగా జరిగాయి. పేదప్రజలకు పండ్లు, నగదును అందించారు. ఉండి కాంగ్రెస్ పార్టి ఇన్‌చార్జి వేగేశ్న గోపాలకృష్ణంరాజు పాల్గొన్నారు.

ఆకివీడు: గాంధీచౌక్, టీడీపీ కార్యాలయాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకట్రావు జాతీయ జెండాలు ఎగుర వేశారు.

భీమవరం టౌన్: దేశం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకుందామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరంలోని పలు చోట్ల ఎమ్మెల్యే అంజిబాబు జెండా ఆవిష్కరణ చేశారు. జనసేన కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఏరియా ప్రభుత్వాసుపత్రి, చినపేట, ఎంపీడీవో, ఏఎంసీ కార్యాలయం తదితర ప్రాంతాల్లో జెండాలు ఆవిష్కరించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి జాతీయ జెండా ఎగుర వేశారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మద్దుల రాము చల్లబోయిన గోవింద్ ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందుకురి రామలింగరాజు మాజీ ఎంపీపీ బర్రె నెహ్రూ ఏపీ కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు పాల్గొన్నారు.

తణుకు: జాతీయ జెండా అంటేనే స్ఫూర్తి, త్యాగం, ధైర్యం అని దానికి అనుగుణంగా దేశ సమగ్రతకు, సమానతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం, క్యాంపు కార్యాలయం, రైతు సంఘ భవనంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్. డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు. మాంటిస్సోరి స్కూల్‌లో స్కూలు డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు జెండా ఆవిష్కరించారు. ఎస్‌కెఎస్‌డి జూనియర్ కళాశాలలో దారిదీపం సంపాదకులు డీవీవీఎస్ వర్మ జెండా ఆవిష్కరించారు. ఎస్సీఐఎం డిగ్రీ కాలేజిలో ప్రిన్సిపాల్ ఏడుకొండలు, బాష్యం స్కూలులో ప్రిన్సిపాల్ ఎ.శ్రీమన్నారాయణ రెడ్డి జాతీయ జెండాలు ఆవిష్కరించారు.

గణపవరం: గణపవరం తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొని జాతీయ పతాకాలు ఆవిష్కరించారు. చింతలపాటిమూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీకాలేజీలో వ్యాసరచన, వకృత్వం తదితర పోటీల్లో గెలుపొందిన వారికి ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలకుమారి చేతులు మీదుగా బహుమతులు అందజేశారు.

పాలకొల్లు అర్బన్,/ పాలకొల్లు టౌన్: పట్టణంలో కెనాల్ రోడ్డులో జాతీయ పతాకాలను కూటమి నాయకులు ఆవిష్కరించారు. శ్రీవాసవీ ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బి.విజయసారథి తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లు, ఇన్‌కంటాక్స్, పోస్టాఫీసు, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద, వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో జాతీయ పతకాలను ఆవిష్కరించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పురస్కారాలు

తణుకు, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): తణుకు డిపోలో పనిచేస్తున్న ఎన్. ధర్మేంద్రవర్మకు ఉత్తమ సేవలందిం చినందుకు జిల్లా కలెక్టర్ చదవవాడ నాగరాణి చేతులు మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. అలాగే ఉత్తమ సేవలందించిన పలువురు ఉద్యోగులు షేక్ లాల్, కె.ఎస్‌రావు, సూర్యం, నాయరాయణ, రాజబాబు, అప్పారావు, సీతారాముడు శ్రీనివాసులు జిల్లా ప్రజా రవాణా అధికారి వరప్రసాదు చేతులు మీదుగా అవార్డులు అందుకున్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌గా కమ్మిలి రాంబాబు

పాలకోడేరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): గొల్లలకోడేరు గ్రామానికి చెందిన గ్రామ టీడీపీ అధ్యక్షులు కమ్మిలి రాంబాబు ఉండి ఏఎంసీ డైరెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాంబాబును పలువురు అభినందించారు.



మూలస్థానేశ్వరికి నెమలి పించాలతో అలంకరణ

యలమంచిలి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా స్థానిక శ్రీమూలస్థానేశ్వరీ అమ్మవారికి నెమలి పించాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. పురివిప్పిన నెమలి వాహనంపై అమ్మవారు కొలువుదీరిన విధంగా చేసిన అలంకరణను భక్తులు వీక్షించి తరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అధికసంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోళ్ల పుట్టిన రోజు వేడుకలు



కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు పుట్టినరోజు వేడుకలను కూటమి నాయకులు, కార్యకర్తలు గురువారం నిర్వహించారు. పబ్లిక్స్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. భీమవరం పాతబస్టాండ్ వద్ద పేదలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంచిపెట్టారు.